సాక్షి తిరుపతి

శుక్రవారం । 25 । జూలై । 2025



బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేయాలి

బాల్యవివాహాల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని బాలల హక్కుల పరిరక్షణ సంఘం సభ్యురాలు పేర్కొన్నారు. - 8లో



ఉల్లాస్-అక్షరాంధ్రను పటిష్టం చేద్దాం

జిల్లాలో ఉల్లాస్- అక్షరాంధ్ర కార్యక్రమాన్ని పటిష్టం చేద్దామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. - 8లో



రైతుల నిరసన

రెతు సేవా కేంద్రంలో ఖాళీగా ఉన్న సిబ్బందిని తక్షణం భర్తీ చేయాలని కేంద్రం ఎదుట రైతులు నిరసన చేపట్టారు. - 8లో

న్యూస్‌రీల్

ఆహార ఉత్పత్తుల పరిశోధన కేంద్రం ఏర్పాటుకు కృషి



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాపును ప్రారంభిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ హోమ్‌సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆహార ఉత్పత్తుల పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామని వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. వర్సిటీలోని సెనేట్ హాల్‌లో గురువారం ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్, డైటిక్స్ –ఫుడ్ టెక్నాలజీ, హోమ్ సైన్స్ విభాగాలు సంయుక్తంగా అప్లికేషన్స్ ఆఫ్ టెక్చర్ అనాలిసిస్ ఇన్ ఫుడ్ సైన్స్ అన్న అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఇందులో వీసీ ముఖ్య అతిథిగా పాల్గొని వర్క్‌షాపును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో ఫుడ్ టెక్నాలజీ విభాగాన్ని, ఆహార ఉత్పత్తి పరిశ్రమలను అనుసంధానం చేస్తామన్నారు. యూఎస్‌లోని పూర్వడా వర్సిటీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, రాగిణి శర్మ మాట్లాడుతూ మానవ శారీరక నిర్మాణానికి అవసరమైన ఆహారం, నీరు, పోషకాల ప్రాధాన్యతను వివరించారు. రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి, ప్రొఫెసర్ మంజుల, కేవీ సుచరిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ తొలి విడత అడ్మిషన్లు ప్రారంభం

- సోమవారం నుంచి రెండో విడత వెబ్ ఆప్షన్ల ప్రక్రియ



ఇంజినీరింగ్ కళాశాలలో అడ్మిషన్ల కోసం విచ్చేసిన విద్యార్థులు

తిరుపతి సిటీ : ఎట్టకేలకు ఇంజినీరింగ్ తొలి విడత అడ్మిషన్ల జాబితా బుధవారం విడుదల కావడంతో ఇంజినీరింగ్ కళాశాలలు కోలాహలం నెలకొంది. తొలి విడత సీట్లు సాధించిన విద్యార్థులు సంబంధిత కళాశాలలో గురువారం రిపోర్ట్ చేసి అడ్మిషన్లు పొందారు. దీంతో జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, డీమ్డ్, అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలు విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడిగా మారాయి. తొలిరోజు 56 శాతం మేర విద్యార్థులకు అడ్మిషన్లు పొందినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలతో కళకళలాడుతున్నాయి. 27వ తేదీ వరకు తొలి విడత అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగనుంది. రెండో విడత వెబ్ ఆప్షన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు సమాచారం.

తమ్ముళ్లకు ఉపాధి

పేదలకు ఉపాధి పనులు కల్పించి వలసలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం తమ్ముళ్లకు ఆదాయ వనరుగా మారింది. చంద్రగిరి నియోజకవర్గంలో క్షేత్రస్థాయి సిబ్బంది , మండల స్థాయి అధికారులు కుమ్మక్కై ఉపాధి పనుల్లో రూ.లక్షలు దోచుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో ఇష్టారాజ్యంగా పేర్లు ఎక్కించి దోపిడీకి పాల్పడుతున్నారు. అక్రమాలపై పక్కా ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేకపోవడం గమనార్హం.

నకిలీ కూలీలతో అక్రమాలు

- పనులు చేయకనే పూర్తి చేసినట్లుగా బిల్లుల నమోదు
- ఒక్కో ఉపాధి కూలీ నుంచి వారానికి రూ.200 చేతివాటం
- క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులు కుమ్మక్కు
- పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- చంద్రగిరి నియోజకవర్గంలో ఇదీ ఉపాధి పనుల తీరు



రామచంద్రాపురం : కొత్త వేపకుప్పంలో గతంలో చేసిన ఫీడర్ చానల్ పనులకు పై మెరుగులు దిద్దిన దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : పచ్చనేతలు తమ జేబులు నింపుకోవడానికి అడ్డగోలుగా ఉపాధి నిధులను కాజేస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో క్షేత్ర స్థాయి అధికారుల నుంచి మండల స్థాయి అధికారుల వరకు అందరినీ తమ చెప్పు చేతుల్లోకి తీసుకుని అభివృద్ధి పనుల ముసుగులో నిధులను దోచేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో పనులకు వెళ్లని ఎందరో వ్యక్తుల పేర్లను ఉపాధి పనులకు వెళ్లినట్టుగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి జాబ్ కార్డుల ఆధారంగా మస్టర్లు చూపించి దోపిడీకి పాల్పడుతున్నారు. ఒక పక్కన సామాజిక తనిఖీల్లో అంతులేని అవినీతి జరిగినట్లు బయట పడుతున్నా గుట్టు చప్పుడు కాకుండా తొక్కేస్తున్నారు. పనులు చేయకనే చేసినట్టుగా బిల్లులు పెట్టడం, వారానికి ఒకసారి ఒక్కో ఉపాధి కూలీ ఖాతా నుంచి రూ.200 మండల స్థాయి అధికారులకు ముట్టజెబుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. అలా ఇవ్వకుంటే తమ్ముళ్లు పెట్టిన నకిలీ కూలీల పేర్లకు అనుమతించరని సమాచారం.

ఫిర్యాదులు అందినా ..విచారణ ఏదీ?

ఉపాధి పనుల్లో అంతులేని అవినీతి చోటు చేసుకుందని ఆధారాలు ఉన్నప్పటికీ జిల్లా అధికారులు మాత్రం అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే ఢిల్లీ స్థాయిలో ఫిర్యాదులు చేరినప్పటికీ అధికారుల్లో చలనం లేకపోవడం, కలెక్టర్‌కు స్వయంగా ఆధారాలతో సహా అవినీతి పనులకు సంబంధించిన వివరాలు అందించినప్పటికీ ఎటువంటి రికవరీలు చేపట్టకపోవడంపై అసలైన కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పనులకు సంబంధించిన నిధులు పూర్తిగా పక్కదారి పట్టాయని చెప్పడానికి చంద్రగిరి నియోజకవర్గం నుంచి 1400 పేజీల ఆధారాలను ఇటీవల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కలెక్టర్‌కు అందజేయడం, అదే కాపీలను ఢిల్లీ అధికారులకు కూడా ఇవ్వడమే నిదర్శనం.

పనులు చేయకనే చేసినట్లు బిల్లులు

చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలంలోని వేపకుప్పం పంచాయతీ పరిధిలో పనులు చేయకుండానే చేసినట్టుగా ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్‌లో మార్ఫింగ్ ఫొటోలు అప్‌లోడ్ చేసి బిల్లులు నమోదు చేసుకుంటున్నట్టు సమాచారం. అది కూడా గ్రామంలో లేని వారి పేర్లు, నడిరోడ్డుపై నిలుచున్న వారి ఫొటోలు అప్‌లోడ్ చేసి పనులు చేస్తున్నట్టుగా అప్రూవల్ చేయడం విమర్శలకు తావిస్తోంది. అంతేకాక గతంలో చేసిన పనులకు సెక్షన్ చేసి మళ్లీ, మళ్లీ బిల్లులు పెట్టడం. ఆ బిల్లులు జమ అయిన జాబ్ కార్డు దారుల ఖాతాల నుంచి డబ్బులు బలవంతంగా లాగేసుకోవడం నిత్యం జరుగుతున్న తంతుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ హిమాల్‌రెడ్డి మండల సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించడం, జిల్లా కలెక్టర్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా రికవరీలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఒక్కో ఉపాధి కూలీ నుంచి రూ.200 వసూలు



ఉపాధి పనుల్లో పనిచేసే కూలీల సంఖ్యను తప్పుగా రికార్డు చేసి అప్రూవల్ ఇవ్వడానికి ఒక్కో కూలీ నుంచి రూ.200 మండల, జిల్లా స్థాయి అధికారులకు ముట్టచెబుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అలాగే ఉపాధి పనుల వేతనం తమ ఖాతాకు జమ అయిన తరువాత ఆ డబ్బులు తీసివ్వడానికి వచ్చే కూలీలకు రూ.200 ఇచ్చి మిగతా మొత్తం పచ్చనేతలు తమ జేబుల్లోకి వేసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా రూ.కోట్లలో అక్రమాలు?

తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఒక ఏడాది కాలంగా జరిగిన ఉపాధి హామీ పనుల్లో కోట్ల రూపాయలు గోల్‌మాల్ జరిగినట్టు సమాచారం. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు 15.08 లక్షల మంది ఉపాధి కూలీలు పనిచేసినట్టుగా రికార్డులకు ఎక్కించారు. ఇందులో ఒక్కో కూలీకి 7 రోజులకు సరాసరిన 1500 చెల్లించినట్లయితే రూ.226 కోట్లు కూలీల ఖాతాలకు జమచేశారు. అందులో 40 శాతం మంది ఉపాధి కూలీలు పనులకు వెళ్లకుండానే వెళ్లినట్టుగా మస్టర్ వేసినట్టు తెలుస్తోంది. ఆ ప్రకారం 6.50 లక్షల మంది కూలీలు బోగస్ పేర్లతో ఆన్‌లైన్‌కు ఎక్కించినట్టుగా సమాచారం. ఆ లెక్కన నకిలీ ఉపాధి కూలీల ఖాతాలకు రూ.97.50 కోట్లు జమ చేసినట్టుగా తెలుస్తోంది. అందులో అధికారుల వాటా కింద రూ.13 కోట్లు, కూలీల వాటా కింద మరో రూ.13 కోట్లు చేరగా మిగతా రూ.71.50 కోట్లు పచ్చనేతల జేబులకు చేరినట్టుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

పనిచేసిన కూలీలకు తక్కువ డబ్బులు



ఉపాధి పనులకు వెళ్లి కష్టపడి పనిచేసిన మాకు తక్కువ డబ్బులు వస్తున్నాయి. మా వర్క్ ఐడీ ద్వారా వేరే వాళ్లను పనిచేసినట్టుగా మస్టర్లు వేసుకుని దొంగతనంగా అధిక బిల్లులు డ్రా చేసుకుంటున్నారు. కష్టపడిన మాకు మాత్రం రోజుకు రూ.150 కూడా రావడం లేదు. అదేమని అడిగితే మీరు చేసిన పనికి అంతే బిల్లు వచ్చిందంటున్నారు.

– గోవిందమ్మ, ఉపాధి కూలీ, కొత్త వేపకుప్పం

చేయని పనికి బిల్లులు



నేను వెళ్లిన పనికి డబ్బులు పడుతున్నాయి. చేయని పనికి కూడా బిల్లులు చేసుకుని నా ఖాతా నుంచి డ్రా చేసుకుంటున్నారు. దొంగదారిలో చేసుకుంటున్న బిల్లులకు మేం సహకరించకుంటే మాకు పనులు ఇవ్వడం లేదు. అలాగని మేం కూడా వాళ్లు చెప్పినట్టు వినాల్సి వస్తోంది.

– గురవయ్య, ఎస్టీ కాలనీ, కొత్త వేపకుప్పం

చిన్న తప్పు జరిగినా చర్యలు




కూలీలను మార్చి బిల్లులు చేయడం, వర్క్ ఐడీలు మార్చడం వంటి తప్పులు ఎక్కడ జరిగినా వదలడం లేదు.. ఉపాధి పనుల నిర్వహణలో చిన్నతప్పు జరిగినా పెద్ద శిక్ష తప్పదు. శ్రీకాళహస్తి మండలంలో జరిగిన సామాజిక తనిఖీల్లో తప్పులు చేసిన ఫీల్డు అసిస్టెంట్లు ముగ్గురుని సస్పెండ్ చేయడం జరిగింది. ఇప్పటికే జాబ్ కార్డులను చాలా వరకు క్రమబద్ధీకరించాం. ఇంకా అలాంటి తప్పులు ఎక్కడైనా జరుగుతుంటే మా దృష్టికి తీసుకొస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసప్రసాద్, డ్వామా పీడీ, తిరుపతి జిల్లా

ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించాలి

– పార్లమెంటులో ఎంపీ గురుమూర్తి



లోకసభలో మాట్లాడుతున్న ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం : ఎంఎస్‌ఎంఈలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలని ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు. పార్లమెంటులో తిరుపతి జిల్లా నుంచి ఏవైనా ఎంఎస్‌ఎంఈ యూనిట్లను గుర్తించారా? అలాగే ఎగుమతిదారులకు ఆర్థిక మద్దతు, క్రాస్-బోర్డర్ ఫ్యాక్టరింగ్, విదేశీ మార్కెట్లలో నాన్-టారిఫ్ అడ్డంకులను అధిగమించడంలో సహాయం పొందారా..? అంటూ ఎంపీ ప్రశ్నించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించి గురువారం ఆయన పార్లమెంటులో కీలక ప్రశ్నను లేవనెత్తారు. ఎగుమతుల ప్రోత్సాహ మిషన్‌ను వాణిజ్య, ఎంఎస్‌ఎంఈ, ఆర్థిక శాఖలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయని, కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే ఎంపీ గురుమూర్తి ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఏపీలో రెండు ఆర్థిక సంవత్సరాలలో ఈ పథకం కింద 7 ఎంఎస్‌ఎంఈలకు రూ.16 లక్షల ఆర్థిక సహాయం అందిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలోని ఎంఎస్‌ఎంఈలకు సమాన అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీ సభలో పేర్కొన్నారు. ఏపీలో రెండు ఆర్థిక సంవత్సరాలలో కేవలం 7 ఎంఎస్‌ఎంఈలకు రూ. 16 లక్షల ఆర్థిక సాయం మాత్రమే అందించడం శోచనీయమని ఎంపీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎంఎస్‌ఎంఈ లను ప్రోత్సహిస్తే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వసతి గృహంలో విచారణ

కలువాయి(సైదాపురం): కలువాయి ఎస్సీ బాలుర హాస్టల్‌లో గురువారం సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి విచారణ చేపట్టారు. ఈనెల 16న జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ శోభారాణికి వివరణ ఇవ్వాల్సిందిగా మెమో ఇచ్చిన విషయం విధితమే. అయితే క్షేత్రస్థాయిలో విచారణకు వచ్చి వార్డెన్, విద్యార్థులను విచారించి వెళ్లారు. మీడియాకు సమాచారం ఇవ్వకుండా డీడీ వెళ్లిపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

పీ4 ప్రాజెక్టుకు దాతలు కావాలి

తిరుపతి అర్బన్ : పీ4 ప్రాజెక్టుకు దాతలు కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. కలెక్టరేట్ నుంచి ఆయన గురువారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పలు కంపెనీలకు చెందిన పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ముందుకు రావాలని సూచించారు. ప్రధానంగా కంపెనీలకు చెందిన వారు మీ పరిధిలోని పేద కుటుంబాలను ఎంపిక చేసుకోవాలని కోరారు. పేద కుటుంబాలకు సంబందించి విద్య, నైపుణ్యంతో పాటు వారి అవసరాలను తీర్చడానికి మార్గదర్శకులు కావాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖా అధికారి చంద్రశేఖర్ హాజరయ్యారు.

హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, గురుకుల వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన వసతి గృహాల వార్డెన్స్, కోఆర్డినేటర్స్‌తో పాటు ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వసతి గృహంలోని విద్యార్థులకు మెనూ ప్రకారం రుచి కరమైన భోజనం, వసతులు కల్పించాలని చెప్పారు. వార్డెన్లు నిత్యం అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రానున్న వర్షకాలం నేపథ్యంలో విద్యార్థులు రోగాల బారిన పడకుండా వైద్య సదుపాయాలను కల్పించాలని చెప్పారు. జిల్లా అధికారులు కార్యాలయానికే పరిమితం కాకుండా నిత్యం హాస్టల్స్‌పై నిఘా పెట్టాలని పేర్కొన్నారు. మరోవైపు హాస్టల్స్ మరమ్మత్తులకు మంజూరు చేసిన నిధులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, ఎస్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి రాజా సోము, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల స్కూల్స్ కోఆర్డినేటర్ పద్మజ, గురుకుల పాఠశాల జిల్లా సమన్వయకర్త రేష్మ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు , అసిస్టెంట్ సంక్షేమ అధికారులు, అసిస్టెంట్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈ నెల 19 నుంచి ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు గురువారం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రకాశం భవన్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులపై ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎంపీ అక్రమ అరెస్టు.. కూటమి కుట్ర

శ్రీకాళహస్తి : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ శ్రీకాళహస్తి పట్టణం, గాలిగోపురం వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజకీయ లబ్ధి కోసం అరెస్టు చేయడం దారుణమని, కూటమి కక్ష పూరిత రాజకీయాలు ఎల్లకాలం సాగవన్నారు. కూటమి అరాచకాలపై ప్రజలు తిరగబడే కాలం దగ్గర్లో ఉందన్నారు. ఉండవల్లి అరుణ్ కుమార్ మాటలను చంద్రబాబు గుర్తు చేసుకోవాలని రానున్న రోజుల్లో కూటమికి డిపాజిట్లు కూడా రావని తెలిపారు. ప్రశ్నిస్తానని వచ్చిన పవన్ కళ్యాణ్ ప్రజలను గాలికి వదిలేసి తన సినిమా రేట్లు పెంచుకొని దీని కోసమే రాజకీయాలకు వచ్చానని చెప్పడం చూస్తుంటే చాలా బాధేస్తుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వస్తున్న జనాధరణను చూసి ఓర్వలేక అలాగే ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజలను డైవర్ట్ చేయడానికి కుట్ర పన్నుతున్నారని అన్నారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరూ తారక శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నాం వాసుదేవ నాయుడు, ఏర్పేడు మండల ఇంచార్జ్ గున్నేరీ కిషోర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ భాష, ఏర్పేడు మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, తొట్టంబేడు మండల అధ్యక్షుడు కోగిల సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్, మున్నా రాయల్, జయ శ్యామ్ రాయల్,కంఠ ఉదయ్ కుమార్,మస్తాన్, యువజన విభాగం అధ్యక్షులు, నేతలు , కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

కక్ష సాధింపుతోనే వేధింపులు

కేవీబీపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని వైఎస్సార్‌సీపీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ కేవీబీపురం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి నూకతోటి రాజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను అమలు చేయలేక వాటిని ప్రశ్నించిన ప్రతిపక్ష నేతలను అక్రమ కేసుల్లో జైలుకు పంపుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు నీరుపోసి పెంచి పోషిస్తున్న కేసులే రేపటి రోజున వారిని చుట్టుముట్టి ఊపిరాడనీయకుండా చేస్తాయని హెచ్చరించారు. టీడీపీ కవ్వింపు చర్యల పట్ల వైసీపీ నేతలు, కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని రాజేష్ సూచించారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు గవర్ల కృష్ణయ్య, ధనుంజయరెడ్డి, బొర్రా మాధవీరెడ్డి, లాల్‌బాబుయాదవ్, దశరథరామిరెడ్డి, చందురెడ్డి, నంద కుమార్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, ఎంపీటీసీలు అయ్యప్పరెడ్డి, సర్పంచ్ గిరిబాబు, మైనారిటీ సెల్ నేతలు, బీసీ సెల్ నేతలు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నూకతోటి రాజేష్ , పార్టీ శ్రేణులు

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 80,130 మంది స్వామిని దర్శించుకున్నారు. 26,786 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.55 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.1,01,900
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.9,212
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,18,100
రిటైల్ వెండి గ్రాము	రూ.121.10

అంధ క్రీడాకారుడికి కలెక్టర్ అభినందన



బ్లైండ్ స్పోర్ట్స్ క్రీడాకారులతో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఏపీ తరఫున గోల్‌బాల్ భారత్ జట్టుకు ఎంపికైన ముప్పాళ్ల శేషగిరిని కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. గురువారం కలెక్టరేట్‌లో బ్లైండ్ స్పోర్ట్స్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి పెంచల నరసయ్య ఆధ్వర్యంలో ముప్పాళ్ల శేషగిరి కలెక్టర్‌ను కలిశారు. ఈ క్రమంలో కలెక్టర్ వారిని అభినందించి మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



డివిజి శంకర్ రావు

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి శంకర్‌రావు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా.. టీటీడీ అధికారు లు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

అభిమానం.. అగ్రపథం



ఉమ్‌లింగ్‌లా రహదారి పక్కన ఎగురుతున్న వైఎస్సార్‌సీపీ జెండా



వైఎస్సార్‌సీపీ మేమంతా సిద్ధం జెండాతో మనోజ్ రెడ్డి

జననేత జగనన్నపై అభిమానం ఉప్పొంగింది. పేదలకు అండ వైఎస్సార్‌సీపీ జెండాను అగ్రపథాన నిలిపింది. ప్రపంచంలోనే ఎత్తయిన జమ్ము పరిధిలోని ఉమ్‌లింగ్‌లా రహదారిపై పార్టీ పతాకాన్ని రెపరెపలాడించింది. వివరాలు.. నాయుడుపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి భాస్కర్ రెడ్డి తనయుడు మనోజ్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన రెండు రోజుల కిందట జమ్మూ పర్యటనకు వెళ్లారు. ఈ క్రమంలో సముద్ర మట్టానికి 19,024 అడుగుల్లో నిర్మించిన ఉమ్‌లింగ్‌లా రహదారిపై ప్రయాణం సాగించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి పార్టీపై మమకారం చాటుకున్నారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమంటూ హర్షం వ్యక్తం చేశారు.

– నాయుడుపేట టౌన్

పాఠశాల విలీనం ఆపాలని ఆందోళన



ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నారాయణవనం : మండలంలోని తుంబూరు దళితవాడ ప్రాథమిక పాఠశాల విలీనాన్ని విరమించుకోవాలని పిల్లలతో కలిసి తల్లిదండ్రులు, ఏఎస్ఎఫ్ఐ నేతలు గురువారం తహసీల్దార్, మండల విద్యాధికారి కార్యాలయాల ఎదుట ఆందోళనకు దిగారు. ఊరి బడిలోనే పిల్లలు చదువుకునే వెసులుబాటును కల్పించాలని, పిల్లలను చదువుకు దూరం చేయొద్దంటూ నినాదాలు చేశారు. అనంతరం డీటీ భాను ప్రకాష్, ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వేర్వేరుగా వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఎఫ్ఐ నాయకులు ఉదయ్ కుమార్, మహేష్, తల్లిదండ్రులు మాట్లాడుతూ.. విలీనం పేరుతో పాఠశాలలను మూసివేయడం, డీ గ్రేడ్ చేయడం దారుణమన్నారు. తుంబూరు దళితవాడ పాఠశాలలో చదువుతున్న 56 మంది విద్యార్థులను పది మంది విద్యార్థులే ఉన్న పాఠశాలలో విలీనం చేయడం సరైన విధానం కాదన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు విద్యాసాగర్, ఇందుమతి, సారా,భాగ్యరాజ్, గోవిందయ్య, ప్రసాద్, మునివేలు, కుప్పలు, చంద్రయ్య, రవి, రాము, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

నారాయణవనం:తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి నాగరాజ్, మెడికల్ ఆఫీసర్ హరిత తెలిపారు. శుక్రవారం ఏర్పేడు, పాపానాయుడుపేట పీహెచ్‌సీల్లో, జూలై 28న సోమవారం ఎంపేడు, కొటాల, జూలై 29న భాకరాపేట, ఎర్రావారిపాళెం, జూలై 31వ తేదీ యల్లమంద, నెరబైలు ప్రాథమి ఆరోగ్య కేంద్రాల్లో పింక్ బస్సు ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అక్రమ అరెస్టులతో భయపెట్టలేరు

- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



చెవిరెడ్డి లక్ష్మిని కలిసి ధైర్యం చెబుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని, అక్రమ అరెస్టులతో ఎవ్వరినీ భయపెట్టలేరని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వెల్లడించారు. గురువారం తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసానికి చేరుకున్న ఆయన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మిని పరామర్శించి ధైర్యం చెప్పారు. లిక్కర్ స్కాం కేసులో నెల రోజులుగా చెవిరెడ్డిని జైలులో బంధించడాన్ని ఆయన తప్పుబట్టారు. చెవిరెడ్డి, మిథున్ రెడ్డి వంటి వ్యక్తులను జగనన్నకు దూరం చేయాలని కుట్రలు పన్నుతూ తప్పుడు కేసుల్లో ఇరికిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

క్షేత్ర సహాయకుడిపై హత్యాయత్నం



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు నవీన్

రేణిగుంట : మండలంలోని కరకంబాడి పంచాయతీ ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న నవీన్‌పై బుధవారం అర్ధరాత్రి ఇంట్లో పెట్రోల్ పోసి నిప్పంటించారు. అర్బన్ సీఐ జయచంద్ర, ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అర్బన్ పోలీసుల కథనం మేరకు.. కరకంబాడి పంచాయతీ పరిధిలోని దొడ్ల మిట్టలో నివాసం ఉంటున్న నవీన్ ఉపాధి పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రామాంజనేయులు నవీన్‌తో పలుమార్లు ఘర్షణ పడినట్లు తెలిపారు. అందులో భాగంగా బుధవారం అర్ధరాత్రి నవీన్ నూతనంగా రిలీజ్ అయిన ఓ సినిమాకి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చి బెడ్ రూమ్‌లో కిటికీ తీసి నిద్రిస్తున్న సమయంలో పెట్రోల్ పోసి నిప్పంటించారు. మంటలను గమనించిన నవీన్ కేకలు వేస్తూ బయటకు పరుగులు తీయగా నిప్పు పెట్టి వెళుతున్న వారిని గుర్తించాడు. ఘటనపై అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు నవీన్ మాట్లాడుతూ.. తనను హత్య చేసేందుకే ఇంటికి నిప్పు పెట్టారని , రామాంజనేయులు, ఆదినారాయణ, అనురాధ ముగ్గురిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనకు వివాహేతర సంబంధం అనుమానమే కారణమై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

అత్తతో పాటు భార్యనూ కడతేర్చేందుకు వ్యూహం

నాయుడుపేటటౌన్ : భార్య కాపురానికి రాలేదని దీనికి అడ్డుగా ఉన్న అత్త సగటూరు చెంగమ్మ(47)తో పాటు భార్య స్వాతిని హత్య చేసేందుకు భర్త బోడెద్దుల వెంకయ్య పథకం రూపొందించుకున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు వివరించారు. పోలీసుల కథనం మేరకు.. వెంకయ్య పథకం ప్రకారమే మంగళవారం నెల్లూరులోని కుమార్తె ఇంటి వద్ద ఉన్న అత్త చెంగమ్మకు ఫోన్ చేసి తాను పురుగుమందు తాగి చనిపోతున్నట్లు చెప్పాడన్నారు. దీంతో చెంగమ్మ నెల్లూరు నుంచి బయలు దేరి మంగళవారం మధ్యాహ్నం పండ్లూరు గ్రామం వద్ద దిగి అక్కడ నుంచి ఆటోలో వచ్చి తుమ్మూరు గ్రామ స్వర్ణముఖి నది బ్రిడ్జి సమీపంలోని నది కట్ట మీద నిలబడి ఉన్న అల్లుడు వెంకయ్య వద్దకు చెంగమ్మ చేరుకున్నట్లు తెలిపారు. ఆమెపై కోపంతో ఉన్న వెంకయ్య ఒక్కసారిగా అతడి వద్ద ఉన్న కత్తితో అత్తను కిరాతకంగా గొంతు కోసి హత్య చేశాడని పోలీసులు తెలిపారు. నది కట్టపై నుంచి చెంగమ్మ మృతదేహాన్ని కిందకు తోసేసి తిరిగి పండ్లూరు గ్రామానికి వచ్చి పార తీసుకుని రాత్రి స్వర్ణముఖి నది వద్దకు వెళ్లి చెంగమ్మ మృతదేహాన్ని నదిలో పూడ్చి పెట్టాడన్నారు. మంగళవారం రాత్రి అయ్యప్పరెడ్డి పాళెం గ్రామంలోని చెంగమ్మ ఇంటి వద్దకు వచ్చి భార్య స్వాతి కోసం వెతికాడన్నారు. భార్య ఇంటి వద్ద ఉండి ఉంటే ఆమెను కూడా హత్య చేసేవాడని పోలీసులు తెలిపారు. వెంకయ్యను బుధవారం ఉదయం గ్రామస్తులు పట్టుకుని నిలదీయడంతో జరిగిన విషయాన్ని వెల్లడించినట్లు మృతురాలి కుమార్తెలు స్వాతి , అనిత, సుకన్యతో పాటు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ముఖ్యంగా వెంకయ్యతో పాటు మరో ఇద్దరు లేక ముగ్గురు కలిసి చెంగమ్మను హత్య చేసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తూ సీఐ బాబికి వారు ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు చెంగమ్మ హత్యపై అన్ని కోణాల్లో పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు. నిందితుడు వెంకయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వెల్లడించారు.



హత్య కేసులో మరికొంత మంది నిందితులను పట్టుకోవాలని సీఐను కోరిన బాధితులు

కుటుంబ సభ్యుల రోదనలు

అల్లుడి చేతిలో హత్యకు గురైన అత్త చెంగమ్మ మృతదేహానికి పోస్టుమార్టం జరిపి గురువారం సాయంత్రం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మృతదేహానికి పోస్టుమార్టం చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

సిబ్బందిని భర్తీ చేయాలని రైతుల నిరసన

వరదయ్యపాళెం : మండల వ్యవసాయ కార్యాలయంలో ఖాళీగా ఉన్న సిబ్బందిని తక్షణమే భర్తీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం మండల వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది లేని కారణంగా ఈ-క్రాప్ నమోదు సకాలంలో జరగడం లేదని రైతులు వాపోయారు. ఈ-క్రాప్ నమోదు కానందున రైతులు గిట్టుబాటు ధర కోల్పోతున్నారని ఆవేదన చెందారు. ప్రస్తుతం సీఎల్ఎన్‌పల్లి, ముస్లింపాళెం, మరదవాడ, లక్ష్మీపురం, కళత్తూరు ప్రాంతాల్లో వరి పంట సాగు చేసి ఉన్నారని, ఆ పంటకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు చేయడంలో వ్యవసాయశాఖ అలసత్వం వహిస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత కారణాన్ని చూపుతున్నారని రైతులు తెలిపారు. దీని వల్ల రైతులు ఒక్కో బస్తా మీద రూ. 300 వరకు రేటు కోల్పోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన చెందారు. రైతు సేవా కేంద్రాలకు క్షేత్రస్థాయి సిబ్బందిని నియమింపజేయాలని రైతులు డిమాండ్ చేస్తూ మండల వ్యవసాయశాఖ అధికారిణి గౌరికి వినతిపత్రాన్ని అందజేశారు. నిరసన కార్యక్రమంలో సీఎల్ఎన్‌పల్లి మాజీ సర్పంచ్ రవిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మోహన్ తదితరులు ఉన్నారు.

రమణమూర్తికి పురస్కారం



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ డాక్టర్ రమణ


చంద్రగిరి : తిరుపతిలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాల గణాంక శాస్త్రం కంప్యూటర్ అనువర్తనాలు విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రమణమూర్తికి మెరిటోరియస్ టీచర్ అవార్డు లభించింది. ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం 57వ వార్షిక స్నాతకోత్సవం గురువారం విజయవాడలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టర్ రమణమూర్తి మెరిటోరియస్ టీచర్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ, బోధనా, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ఉల్లాస్-అక్షరాంధ్రను పటిష్టం చేద్దాం


తిరుపతి అర్బన్ : తిరుపతి జిల్లాలో ఉల్లాస్-అక్షరాంధ్ర కార్యక్రమాన్ని పటిష్టం చేద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆయన గురువారం కలెక్టరేట్ నుంచి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2029 నాటికి జిల్లాలో వంద శాతం అక్షరాస్యతను సాధించాలన్నారు. 2025-26లో జిల్లాలో 88,687 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. 2024-25లో 12,085 మందిని అక్షరాస్యులుగా తయారు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 15 -59 ఏళ్ల లోపు మహిళలు, పురుషులకు చదవడం, రాయడం, ప్రాథమిక గణితం, డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఈ లక్ష్య సాధనలో అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసుకుని అక్షరాస్యతను పెంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య శాఖ అధికారి మహమ్మద్ ఆజాద్, జిల్లా వయోజన శాఖ నోడల్ అధికారి ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, మెప్మా పీడీ రవీంద్ర, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, డీఈవో కేవీఎన్ కుమార్, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి పాల్గొన్నారు.

ఆటో బోల్తా : మహిళకు తీవ్ర గాయాలు

– మానవత్వం చాటిన కలువాయి జెడ్పీటీసీ



గాయపడిన పుల్లమ్మ



ఘటన స్థలంలో జెడ్పీటీసీ సభ్యుడు

కలువాయి(సైదాపురం) : ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ మహిళ తీవ్రంగా గాయపడటంతో అటు వైపు వెళుతున్న కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డి స్పందించి గాయపడిన మహిళను ఆస్పత్రిలో చేర్పించి.. మానవత్వం చాటుకున్నారు. ఈ ఘటన మండలంలోని తోపుగుంట సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాల మేరకు.. మండలంలోని తోపుగుంట సమీపంలో ఓ ఆటో బోల్తా పడటంతో అందులోంచి వెంకటరెడ్డిపల్లికి చెందిన జంగాల కాలనీకి చెందిన విభూది పుల్లమ్మ తీవ్రంగా గాయపడింది. ఆ సమయంలోనే అటు వైపు వెళుతున్న కలువాయి జెడ్పీటీసీ అనిల్‌కుమార్ రెడ్డి ఘటనా స్థలం వద్ద ఆగి ఆటోను పక్కకు తీసియించారు. 108కు కాల్ చేయగా ఆ వాహనం మరమ్మతులకు గురి అయిందంటూ సమాచారం అందజేయడంతో మరో ఆటో ద్వారా గాయపడిన మహిళను ఆస్పత్రిలో చేర్పించి మానవత్వం చాటుకున్నారు.ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ కోటయ్య సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

మట్టి అక్రమ రవాణా

- ప్రైవేటు వెంచర్లకు తరలింపు
- ఎమ్మెల్యే అనధికార పీఏ హస్తం



అక్రమార్కులు లోడిన మట్టి

టాస్క్‌ఫోర్స్ : మట్టి మాఫియా కాసులు కురిపిస్తోంది. అధికారం మాటున అక్రమ రవాణా సాగుతోంది. మైనింగ్ , రెవెన్యూ, పోలీసు అధికారుల కళ్లెదుటే పెద్ద సంఖ్యలో వాహనాల్లో మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తొట్టంబేడు మండలంలో విరుపాక్షపురం చెరువులో మట్టి తవ్వి ట్రాక్టర్లతో శ్రీకాళహస్తి మండలంలోని పెనుబాకలో ఓ ప్రైవేట్ వెంచరుకు వందల ట్రాక్టర్లు తరలిస్తున్నారు. అధికార పార్టీ అండదండలు ఉండడతో అక్రమ రవాణాను అడ్డుకునే వారే లేకుండా పోయారు. సాక్షాత్తు ఎమ్మెల్యే అనధికారిక పీఏ ఈ అక్రమ రవాణాలో పాత్ర ఉండడంతో అడ్డుకునే ధైర్యం ఎవరూ చేయడం లేదు. చెరువుల నుంచి వందల ట్రాక్టర్లు మట్టి అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోంది.

దరఖాస్తుల ఆహ్వానం

తొట్టంబేడు: కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ పరిధిలో పనిచేస్తున్న బీడీ కార్మికుల కుటుంబాలకు చెందిన విద్యార్థులకు 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఉపకార వేతనాలు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాళహస్తి బీడీ కార్మికుల వైద్యాధికారి డాక్టర్ వెంకట భాస్కర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఆగస్టు 31లోపు, ఇంటర్ డిగ్రీ, ఐటీఐ, ప్రొఫెషనల్ కోర్సులు చేసే విద్యార్థులు అక్టోబరు 31న నాటికి సంబంధిత వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అద్భుతం.. అభినయోత్సవం



జానపద నృత్య ప్రదర్శన

తిరుపతి కల్చరల్ : అభినయ ఆర్ట్స్ జాతీయ నాటక పోటీలలో భాగంగా మహతి కళాక్షేత్రంలో గురువారం ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు, పౌరాణిక, సాంఘిక నాటికలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. మధిర శ్రీసుమిత్ర యూత్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన 'యయాతి' పౌరాణిక పద్యనాటకం సందేశాత్మకంగా సాగింది. చైతన్య కళాభారతి వారు ప్రదర్శించిన 'స్వప్నం రాల్చిన అమృతం' సాంఘిక నాటిక వీక్షకులను చైతన్యపరిచింది. గురజాడ కళామందిర్ వారు ప్రదర్శించిన 'మహాప్రస్థానం' సాంఘిక నాటిక అలరించింది. ఈ సందర్భంగా కళాకారులను అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎస్ రెడ్డి ఘనంగా సత్కరించారు.



పౌరాణిక పద్యనాటకంలోని ఘట్టం

బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేయాలి



మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ సంఘం సభ్యురాలు పద్మావతి

తిరుపతి అర్బన్ : బాల్యవివాహాల నిర్మూలనకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని బాలల హక్కుల పరిరక్షణ సంఘం సభ్యురాలు పద్మావతి వెల్లడించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఏ పరిధిలో వారు బాల్య వివాహాలకు ఎక్కడికక్కడే అడ్డుకట్టవేయాలని పేర్కొన్నారు. బాలికతో పాటు వారి తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మరోవైపు విద్యార్థి దశ నుంచే బాల్య వివాహాలతో వచ్చే అనర్థాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని చెప్పారు. మరోవైపు బాలల హక్కులను వందశాతం అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పిల్లల ట్రాఫింగ్, డ్రాప్ అవుట్స్, అశ్రద్ధ, బాల కార్మికుల పరిస్థితులపై ఎప్పటికప్పుడు అన్వేషణ చేయాల్సి ఉందని తెలిపారు. పాఠశాల పరిధిలోనే 12 రకాల కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉందని చెప్పారు. చైల్డ్ ప్రొటెక్షన్, హెల్త్ అండ్ హైజీన్, స్కూల్ మానిటరింగ్, పీడీఏ కమిటీలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు, ఐసీడీఎస్ పీడీ వసంత బాయి, కేజీబీవీ, రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాళ్లు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వేదిక్ గణిత పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి, విద్యావేత్తలు

తిరుపతి సిటీ : విజయవాడ వేదికగా గురువారం జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆర్కే అబాకస్ వేదిక్ మ్యాథ్స్ 2.0 వర్షన్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. ఆర్కే విద్యా సంస్థల చైర్మన్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ విమల ఆధ్వర్యంలో రూపొందించిన ఈ పుస్తకం గణిత శాస్త్రంపై విద్యార్థులకు ఉన్న భయాన్ని తొలగించి సులువుగా నేర్చుకునేందుకు ఉపయోగపడుతుందని వారు వెల్లడించారు. త్వరలో మరో 10వేల పుస్తకాలను ముద్రించి ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలోని విద్యార్థులు సులువుగా, శీఘ్రంగా, ఉల్లాసంగా గణిత సూత్రాలను నేర్చుకునేందుకు మా వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య బీసీ జనరల్ సెక్రటరీ రెడ్డప్ప, నాగేంద్ర, మేఘనాథ్ రెడ్డి, పలువురు విద్యావేత్తలు పాల్గొన్నారు.